# డబుల్ జీరో

జూదగాడి చేతిలోని ధనంలా పల్చని సాయంకాలపు నీరెండ సన్నగా చల్లగా జారిపోతూందో, ఆస్తి అంతా మంగళహారతి అయిపోయాక ఆటగాడి మనస్సులో వ్యాపించే శూన్యంలాగ చుట్టూ చిక్కని చీకట్లే పరుచుకుంటున్నాయో, "యింకోమాటు లాటరీ వేస్తే అదృష్టం తగలక పోతుందా" అనే వ్యసనపరుడి ఆశాప్రసూనాల్లా అక్కడోటీ అక్కడోటీ తారకలే తళుక్కు-మంటూ వికసిస్తున్నాయో- ఇవన్నీ ఎక్కడ చూశాడు రమణయ్య?

అతని దృష్టి ఎంతసేపటికీ అదిగో, అక్కడికి పదిబారల దూరంలో రోడ్డుపక్క ఎలక్ట్రిక్ దీపం కింద, సీసారేకు డబ్బా ఓటి ముందు పెట్టుకుని అరుస్తూన్న ముష్టివాడు లేడూ, వాడిమీద కేంద్రీకృతం అయి ఉంది.

వాడికి ఉన్నవి చింకిరి గుడ్డలూ, మాసి మాగిల్లుకట్టిన జుట్టూ, అరవై డెబ్బది యేళ్ళ వడిలిపోయిన శరీరమూ,

ఆ శరీరానికి వేళ్లాడుతున్నా రెండు పదులు చింకిపాతలూను. ఆ చింకిరి గుడ్డలలో ఊగిసలాడుతూన్న అస్థిపంజరాన్ని రోజూ సాయంత్రం వేళ అక్కడికి జేరేస్తాడు ఆ ముష్టివాడు. అది పార్కని ఆనుకొని ఉన్న సినిమాలకి వెళ్లే రోడ్డేమో, సాయంత్రం అయిదు అయిదున్నర అయ్యేటప్పటికల్లా ఇటు పార్కుకి వచ్చే జనంతోను, అటు సినిమాకి పోయే జనంతోను మాంచి రద్దీగా వుంటుంది. పార్కు రద్దీ తొమ్మిదింటికి తగ్గినా, రెండో ఆట అయిపోయాక కాని సినిమా జనం హడావిడి తగ్గదు. అందుకే ఆ ముష్టివాడు సాయంత్రం ఆరింటికి వచ్చినవాడల్లా, రాత్రి ఒంటిగంట అయ్యేదాకా అక్కడ కూర్చుని అరుస్తావుంటాడు, "గుడ్డోణ్ణి, బాబయ్యా! దరమం చెయ్యండి" అంటూ.

అంత్రకితం ఏమోకాని, పెంపుడుతండ్రి గతించి పెత్తనం చేతికి వచ్చి, జల్సాగా తిరగడం మొదలుపెట్టిన ఈ రెండేళ్ళ నుంచి మాత్రం రోజూ రవణయ్య ఆ ముష్టివాడిని అక్కడ చూస్తూనే వున్నాడు. వాడి టైమూ తన టైమూ సరిగ్గా ఒక్కటి. తను పార్కుకివచ్చి ఆ మూల సిమెంటుబెంచీమీద శరీరాన్నంతా వెల్లకిలాపరచి, పొడవు సరిపోక తలనీ మెడనీ కిందికి తల్లక్రిందులుగా వెళ్లాడవేసి పార్కు లైటు వెలుతురులో బ్రాకెట్ అంకెల కాగితపు రీలు పరీక్షగా చూస్తూ కూర్చొనే వేళా, ఆ ముష్టివాడు రోడ్డు పక్కన వున్న తన మామూలు స్థలానికి కర్రతో తడుముకుంటూ వచ్చి కూర్చుని "గుడ్డోణ్ణి, బాబయ్యా! దరమం చెయ్యండి!" అంటూ అరవడం ప్రారంభించే వేళా కలుస్తాయి.

ఆ బ్రాకెట్ కాగితపుచుట్ట ఆధారంగా, ఆ రాత్రి వచ్చే బ్రాకెట్ ఓపెనింగూ, క్లోజింగూ ఏదో నిర్ణయించుకొని ఏ యేడున్నరా ఎనిమిదింటికో రవణయ్య అక్కడనుంచి లేచేదాకా, పార్కులోని రకరకాల ధ్వనులతో కలిసి దూరాన్నించి వుండి వుండి ఆ ముష్టివాడికేక వినిపిస్తూనే వుంటుంది రోజూను. కిళ్లీబడ్డీ దగ్గిరికి పోయి బ్రాకెట్ కట్టి, రిజల్ట్ వచ్చేలోగా కాలక్షేపంకోసం అని ఇంటర్వెల్ నుంచి ఇంటర్వెల్ దాకా ఏదో సినిమా చూసి, ఆ తరువాత బ్రాకెట్ ఫలితం తెలుసుకుని ఉసూరుమంటూ తిరిగి ఈ రోడ్డునే కాళ్లీడ్చుకుంటూ వచ్చేటప్పుడు అర్ధరాత్రివేళ చిరాగ్గా వినిపించే ఆ గుడ్డివాడి కేకే, ఏ ఓపెనింగో క్లోజింగో తగిలి హుషారుగా వస్తూన్న రోజున జాలిగా వినిపించడం, దాంతో చేతికివచ్చిన నాణెం ఏదయితే అది తను ఆ ముష్టివాడి డబ్బాలో వేయడం అప్పుడప్పుడు జరుగుతూ వుంటుంది. ఆ రకంగా ఆ ముష్టివాడూ, వాడి కేకా తనకి బాగా పరిచయమే. కానయితే వాణ్ణి ఎప్పుడూ పలకరించలేదు. అంతే.

చూడగా చూడగా ఆ ముష్టితాతకీ తనకీ ఏవో పోలికలుకూడా వున్నట్టు కనిపిస్తున్నాయి. వాడిలాగే తనకీ ఎవరూ లేరు. వున్న ఒక్క పెంపుడు తండ్రీ పోయాడు. పూర్వం యెన్ని లక్షలుంటే ఏంగాక, యిప్పుడు మాత్రం ఆ ముష్టి తాతలాగే తనకీ నా అన్న ఆస్తి నయాపైసా లేదు. వాడిలాగే తనకి కూడా మాసి మసిపాతగా మారిపోయిన ఒకే ఒక బట్టల జత. అయితే, వాడివి చిరిగిపోయిన నూలుపంచె, బనీను. తనవి మాత్రం చిరగని ఖరీదైన సిల్కు

పేంటూ, పట్టూను. వాడు తిండికోసం పబ్లిగ్గా ముష్టెత్తుతూంటే తను బ్రాకెట్ డబ్బులకోసం తెలిసిన ఆ స్నేహితుణ్నీ ఈ స్నేహితుణ్నీ రహస్యంగా దేవురిస్తున్నాడు—అంతే.

కాని ఒక్కటి. వాడు అన్ని ఆశలూ వుడిగిన ముసిలాడు. తను ఏ ఆనందాలు తీరని యువకుడు. ఏ రోజు వచ్చిన పావలా డబ్బులతో ఆ రోజు వాడు తృప్తి పడుతూంటే, పోయిన రెండు మూడు లక్షలతో పాటు యింకో నాలుగైదు లక్షలు ఈ బ్రాకెట్ ద్వారా లాగేదాక తనకి నిద్రపట్టదు. ఆ ముష్టివాడు పుట్టి పెరిగింది, వాడు ప్రస్తుతం కూర్చుంటున్న రోడ్డులాగే పదిమంది వేసే వుమ్ములతోను, పైకి లేచి పడే దుమ్ము దూగరలతోను నిండిన నికృష్టమైన వాతావరణం. తనది మాత్రం అలా కాకుండా అందంగా తీర్చి దిద్దినట్లున్న ఈ పార్కులాంటి సంస్కారవంతమైన నాగరిక వాతావరణం. వాడికి పట్టింపులూ, నామోషీలూ, భేషజాలూ ఏం వుండవు. ఏది అవసరం అయితే అది తిన్నని రోడ్డులాగ ముక్కుకి సూటిగా చేసుకుపోవడమే! తనకి అలా వీలా? పార్కులో మొక్కలకి లాగ అన్నీ వంపు వంకరల ఒయ్యారపు కత్తిరింపులే. సంఘం ఏర్పరచిన నీతి నియమాల సన్నని కాలిబాటలే కాని, విశాలమైన చక్కని జీవితపు రహదారి ఏదీ?

ఇలా తృప్తికీ దురాశకీ మధ్య, నానా చెత్తతోను కూడిన అసహ్యానికీ, నందనవన సౌందర్యానికీ నడుమ, ఋజు మార్గంలా వున్న వాస్తవికతకీ, సొంపైన వంపు తీగల కలల స్వర్గానికీ గల సరిహద్దులో, అందరూ నడిచే రోడ్డునీ, ఏ

కొందరో కాని ప్రవేశించని పార్కునీ కలిపే గేటులో అవతలగా వున్న ముష్టితాతకీ, ఇవతలగా వున్న తనకీ గల పోలికలనీ, భేదాల్నీ బేరీజు వేసుకుంటూ నిలబడ్డాడు రవణయ్య యిందాకటినుంచీను.

అందుకే పగటి భర్తకి విడాకులిచ్చేసి రాత్రి విటుడి జీవితంతో జూదం ఆడడం కోసం అని ఎర్రని పాపిట సిందూరంతోనూ, తెల్లని చుక్కల పువ్వులతోనూ, తన నల్లని చీకటి కురుల్ని అందంగా అలంకరించుకొని, యింకో జగన్నాటకం కోసం సిద్ధం అవుతూన్న నిశాకాంతని గమనించలేదు రవణయ్య.

ఎంతసేపటికీ ఆ పార్కు గేటులో ఆ మట్టునే నిలబడి, కనిపించే ముష్టితాతతో తనని పోల్చుకోవడంలోనే మునిగి వున్నాడు.

ఆ గుడ్డివాడి దగ్గిర ఈపాటికి ఓ పావలా డబ్బులేనా చేరి వుంటాయి. తన దగ్గర పావలామాట అలా వుంచి ఎర్రని రాగిపైసా కూడా లేదు. ఏమాత్రం డబ్బున్నా తను యింకా యిలా వుంటాడూ? ఒక్క పరుగులో పోయి బ్రాకెట్టు కట్టి రాడూ? అందులో యివాళ ఎంత కరెక్టుగా వచ్చిందని సాల్యూషను?

ఈ రెండు మూడేళ్లలోనూ రానంత స్పష్టంగా వచ్చింది పొద్దుట మెయిల్ పేపరులో కార్టూను. దాన్ని ఆమట్టునే పట్టుకెళ్లి ఆచారికి చూపిస్తూ "యివాళ బ్రాకెట్ గన్ షాట్ గా డబుల్ జీరో రా! కావలిస్తే కార్టూను చూడు. పెద్ద ఇనపరింగులు రెండు, చెరో చేత్తోటీ పట్టుకొని నిలబడ్డ

పైల్వానూ, అతణ్ణి చూస్తూ అరసున్నాలా నిలబడ్డ చక్రాల కళ్ల అమ్మాయీను. యినపరింగులూ, చక్రాలకళ్లూ అంటే అర్థం ఏవిటి? అలా తెల్లబోతావేం?...జీరో...అవి రెండేసి కనక, డబుల్‌జీరో అన్నమాట! నవ్వి అలా తేలిగ్గా తీసెయ్యకురా! నా మాట నమ్ము. ఓ వంద యిలా పడెయ్. డబుల్ జీరో మీద బ్రాకెట్ కట్టి అర్థరాత్రి తిరిగేటప్పటికల్లా అరవై వందలు తీసుకువచ్చి నీ ఒళ్లోపోస్తా. ప్లీజ్! ఈ ఒక్కసారికి ఇయ్యి. యింకెప్పుడూ అడగనురా!" అంటూ ఎంతో బతిమాలాడు తను. కాని వింటేనా వాడు? "నువ్వు ఆర్చి చచ్చినా యింక నీకు అర్ధణాకూడా యిచ్చేదిలేదు. ఇప్పటికేనా కార్టూనుకీ న్యూయార్కు కాటన్ మార్కెట్టుకీ సంబంధం వుంది అనే పిచ్చి మానుకో!" అంటూ వెళ్ళిపోయాడు ఆచారి యెంత పిలుస్తున్నా వినిపించుకోకుండా. ఆ తరవాత యెంతమంది కాళ్లా వేళ్లా పడలేదు ఒక్క రూపాయి అయినా ఇవ్వండని. ఏం దుర్దినమో ఒక్కడు యిస్తే ఒట్టు ఇవాళ!

దాంతో చెయ్యెత్తి పిలిచిన అదృష్టం చెంగున గెంతేసి వెళ్లిపోతున్నట్లు అనిపించి గుండెల నిండుగా దుఃఖం వచ్చేసింది. ఇవాళ బ్రాకెట్ "డబుల్ జీరో" వచ్చి తీరుతుందనీ, ఓపెనింగూ క్లోజింగూ రెండూ జీరోయే అని తనకి ప్రగాఢమైన నమ్మకం వుంది. అయితే వచ్చిన చిక్కేమిటంటే అదే నమ్మకం అప్పిచ్చేవాడికి లేదు—ఖర్మ! ఏం లాభం?

తెలిసినవాళ్లందర్నీ అడిగ అడిగి నోరు నొప్పిపెట్టి, ఉసూరుమంటూ వచ్చి ఓ గంట క్రితం ఈ పార్కు బెంచీ

మీాద చతికిలపడ్డాడు తను. తెల్లారి ఏం తినలేదేమో నీరసం వచ్చి ప్రాణం కడంటిపోతూంది. ఎన్నిమాట్లు తాగితే ఏం పంపునీళ్లు యెంతసేపని ఆపుతాయి? ఉత్తి కడుపున తాగిన నీళ్లేమో, అవి పుల్లి త్రేనుపు పడి డోకువస్తున్నాయి.

నీరసంతో కళ్ళు పీక్కుపోతున్నాయి.

కాళ్లు లాక్కుపోతున్నాయి

నరాలు పీక తోడేస్తున్నాయి.

అయినా ఓర్చుకుంటున్నాడు. ఇవేమిటి? యిలాంటి లక్ష ఆకలి బాధల్ని భరిస్తాడు, బ్రాకెట్ వెయ్యడానికి ఒక్క రూపాయి దొరికితే సరి.

ప్చ్... ఏం దొరుకుతుంది? ఉన్నన్నాళ్లూ తన దగ్గిర తిన్నవాళ్లేకాని అవసరానికి ఆదుకునేవాళ్లు ఏరీ?...నిజానికి తనకీ లోకంలో నాఅనేవాళ్లు ఎవ్వరూ లేరు. నాఅన్నవస్తువు లేదు. వందలకొద్దీ వారాల్ని అంకెల లంకెలతో ఆశా పాశంలాగ సాగదీసి తయారుచేసిన ఈ జానెడు వెడల్పైన లావుపాటి బ్రాకెట్ అంకెల కాగితపురీలు తప్ప.

ఇల్లూ, పొలం, ఆస్తి, డబ్బూ, బంధుత్వాలూ, అభిమానాలూ-యిలా పోయినవన్నీ పోగా యింక యివాల్టికి తనకి మిగిన ఆస్తి అల్లా మహా సర్పంలా చుట్టలు చుట్టుకొని ఎల్లవేళలా తనని అంటిపెట్టుకొని పాంటుజేబులో వుండే ఈ కాగితపు రీలు ఒక్కటే! మెయిల్ పేపరులో రోజూ వచ్చే కార్టూన్‌కి వ్యాఖ్యానం అయినా, చిన్నప్పుడు యింటర్ మీడియెట్‌లో యిండక్షన్ డిడక్షన్ అంటూ వల్లెవేసిన తార్కిక

సూత్రాలకి యివాళ తను తయారుచేసిన భాష్యం అయినా, తను ఎక్కదలచుకున్న ఐశ్వర్య సౌధానికి అందంగా అనుర్చుకొంటూన్న అంకెల లిఫ్టు అయినా, తన గత జీవితానికి అర్థం, భవిష్యత్తుకి లక్ష్యం, యిప్పుడు తనకి హోల్ మొత్తం ప్రపంచం అంతా అదే!

అందుకే యిందాకా సిమెంటుబెంచీమీదికి శరీరాన్ని చేరుస్తూ, ఓపక్కనుంచి జ్వాలల్లా లేస్తూన్న ఆకలి మంటల్నీ, మనోమూలాలనుంచి మంచులా బాధిస్తూన్న స్నేహితుల అవహేళనలనీ అణుచుకుంటూ, పాంట్ జేబులోంచి తన ఆప్త భాంధవుణ్ణి తీసి చూసుకుంటూ ఆనందించ సాగాడు రమణయ్య..

ఇంతలో అసలు జ్ఞానం పోయాక ప్రకాశించే ఎరుపు తెలివిలా వెలిగింది సాయంకాలపు వెలుగుపోయాక పార్కు-స్తంభానికి అతికించిన మెర్క్యురీలైటు. ఆ స్తంభానికి వ్రేసి వేళ్లాడదీసిన లౌడ్‌స్పీకర్ తన పెద్ద గొంతుకతో దేశ సౌభాగ్యానికి చిట్కాలు కాబోలు ఉపదేశిస్తూంది. కాస్సేపు సేద తీర్చుకోడానికి వచ్చిన పెద్దమనుష్యులు ముగ్గురేసీ, నలుగురేసీ చొప్పున అక్కడక్కడ మెత్తగా వున్న గడ్డిలో కూర్చుంటూ, మండిపోతూన్న ధరలని గురించీ, ఆ మంటల వేడికి తట్టుకోవడం కోసం కొందరు గడుసువాళ్లు చేతుల్ని తడిచేసుకోవడం గురించీ ఎంతో బాధగా చెప్పుకుని మళ్లీ అంతలోనే బాధ్యతారహితంగా నవ్వుకుంటున్నారు.

ఈ బాధ కానీ, ఆ బాధ్యతకానీ ఏమీపట్టని పిల్లలు ఒకళ్లనొకళ్లు చెట్లచుట్టూ తరుముకుంటూ అరుచుకుంటూ

ఆడుకుంటున్నారు. "మొక్కలు తొక్కకండి ... అల్లరిచెయ్యకండి" అంటూ వాళ్ళవెనకాలే పరిగెడుతూ తనూ ఒక రకముగా వాళ్ళతో పాటు పార్కు తాత కూడ ఆడుకుంటూ ఉంటే, ఆ తాత కంటబడకుండా దాగుడుమూత లాడుతూ తిరుగుతూ, గడ్డిలో కూర్చున్న వద్ద మనుష్యులకి వేరుసెనక్కాయల్నీ, సోడాల్నీ అమ్ముతున్నారు యిద్దరు కుర్రాళ్లు. ఇలా వార్తలూ, కేరింతలూ, కేకలూ, అరుపులతో కోలాహలంగా వున్న పార్కు వాతావరణంలోకి వుండి వుండి చిల్చుకువస్తూంది దూరాన్నించి "గుడ్డోడిని, బాబయ్యా, దరమం చెయ్యండి" అంటూ అరుస్తూన్న ముష్టివాడి కేక.

చుట్టూ జరుగుతూన్న ఈ హడావిడినేం పట్టించుకోకుండా, ఇప్పటిదాకా ఈ గంటసేపూ ఆ బ్రాకెట్ గళ్ళ కాగితపు రీలులోకే ఏకాగ్ర దృష్టితో చూస్తూ రవణయ్య ఆనందమయ లోకాల్లో విహరించాడు. విహరించాడు మరి. కార్టూన్ చేసిన కామెంట్ని, రీలు మళ్ళీ మళ్ళీ వాస్తవంచేసి చూపుతూంది.

ఇవాళ బుధవారం. జూలై మూడో తారీకు. గడచిన నాలుగు బుధవారాలనుంచీ ఓపెనింగ్ ఒక్కొక్కటి చొప్పున హెచ్చి, పోయిన బుధవారానికి తొమ్మిదికి వచ్చింది. అందువల్ల యివాళ ఓపెనింగ్ తొమ్మిది తరవాత అంకె-జీరో అయి తీరాలి. పైగా పోయిన సంవత్సరం జూలై మూడో తారీకు ఓపెనింగ్ కూడా జీరోయే!

అందువల్ల యివాళ ఓపెనింగ్ జీరోయే ఖాయం.

ఇక క్లోజింగ్. ఈమధ్య పదిరోజులనుంచి రోజు విడిచి రోజు జీరో వస్తూంది క్లోజింగ్, మొన్న జీరో. యివాళా

జీరోయే రావాలి. తారీఖుల లెఖ్ఖల ప్రకారం చూసినా ఈ మధ్య బేసినెలల మూడో తారీఖులనాటి క్లోజింగ్‌లన్నీ అయిదో, జీరోయో అవుతున్నాయి మే నెలమూడో తారీఖు క్లోజిగ్ అయిదు కనక, ఈ మూడోతారీఖు క్లోజింగ్ జీరో అయి తీరాలి!

ఏతావతా యివాళ్టి ఓపెనింగూ క్లోజింగూ కూడా జీరోయే అని ఢంకా బజాయించి చెబుతూంది కాగితపు రీలు పొద్దుటి కార్టూన్ కూడా అదే చెప్పిందికదా? రవణయ్య పట్టులేని ఉత్సాహంతో ఒక్క వుదుటున సిమెంటు బెంచీ మీాదినించి లేచాడు. మళ్ళీ మళ్ళీ ఆ మసక వెలుతురులో పార్కులోని జనాన్ని పరిశీలించి చూశాడు. అధమం రూపాయి అయినా అప్పిచ్చే మొహం ఒక్కటీ కూడా కనిపించలేదు అంతమందిలోనూ అతనికి. దాంతో నిరుత్సాహంగా, చిరాగ్గా వచ్చి యిలా పార్కు గేటులో నిలబడి ఆ ముష్టివాడినిచూస్తూ, వాడితో తనని పోల్చుకుంటూ ఆమట్టుని వుండిపోయాడు. యిందాకటినుంచీను.

రూపాయి కాకపోతే అర్ధరూపాయి...పావలా...పది పైసలు...తనకిప్పుడు యెంతో అంత...డబ్బు కావాలి... ఏవిటీ చెయ్యడం?....ఎక్కడ దొరుకుతుందీ డబ్బు....ఏదీ?.... ఎవరి జేబులో వుంది?....ఎలా సంపాదించడం....బుర్రంతా కంగాళీగా వుంది.... ఒక్క క్షణం ఆలస్యాన్ని కూడా భరించ లేక తెగ కంగారు పడిపోతున్నాడు....ఆలోచనేం తెగడం లేదు....డబ్బు....డబ్బు కావాలి....ఎలాగ?....అవతల బ్రాకెట్ టైము దాటిపోతూంది...

ఓ మూల తను ఇలా తెగ కంగారుపడుతూ ఆలోచన

తెమలక చస్తూంటే, ఏమీ తోచనియ్యకుండా ఈముష్టివాడి గోల ఒకటి! వెధవ అరుపు వీడూను! వీడికీ డబ్బు రంధే! గుండ్రంగా బిళ్లలా మాంచి నున్నగా వున్న ఈ రాయేసి కొడితే, ఒక్క దెబ్బతో డామ్మని చస్తాడు ముసలిపీను... చచ్చుగోలా వీడూను!

అయినా చచ్చు ముష్టి ఎన్నాళ్లు ఎత్తుతాడు? ఎన్నేళ్లు ఎత్తితే తీరేను వీడి దరిద్రం! ఏ లాటరీయో వేసుకుంటే పోలే! హాయిగా చచ్చేదాకా కాలుమీదకాలు వేసుకుని కూచుని తినచ్చునే! అసలు ప్రతివాడూ రోజూ తనకి వచ్చే డబ్బులో అంతో ఇంతో అదృష్టంమీదకాయాలి. ఈతగింజ వేస్తే, వస్తుందా కొండని ఈడ్చుకువస్తుంది; పోతుందా ఈతగింజేగా? పోనీ! అలా వుండాలి నన్నడిగితే ప్రతివాడి మనస్తత్వమూను. అసలు యింతకీ ఈముసిలాడు ఎప్పుడేనా బ్రాకెట్ కట్టాడా అని! ఆఁ! వాడి మొహం!.... వాడి బ్రతుక్కి బ్రాకెట్టా. హూఁ! ఏదో నాలుగు డబ్బులు ముష్టి అడుక్కుని...

డ...బ్బు...లు...ఆఁ!...అవును.

రవణయ్య కాళ్లు నెమ్మదిగా వీధిలైటుకిందకూర్చున్న ఆ ముష్టివాడి వేపు కదిలాయి.

డబ్బాలో నాణెంమీద లైటు వెలుగు జిగేల్ మంది. రవణయ్య కళ్లు ఆబగా, తీపి పదార్థంమీదికి ఉరికే ఈగల్లా వాటిమీదికి దూకాయి. రవణయ్య తృప్తిగా ఓ గుటక వేసి, డబ్బామీదికి వంగుతూ యిటూ అటూ భయం భయంగా పరకాయించాడు.

ఎవ్వరూ చూట్టంలేదు!

ముష్టివాడికి చూపే లేదు! డబుల్ శీనోలా కళ్లుండే స్థానంలో రెండు శూన్యమైన సున్నాలు. ఎదురుగుండా డబ్బాలో బ్రాకెట్ కి కట్టడానికి ఉపయోగపడే డబ్బు!

రవణయ్య గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

ఒళ్లంతా చెమట్లు!

చేతులు వణక సాగాయి.

మనస్సు తొందరచేస్తూంది.

మళ్ళీ అంతలోనే గుంజాటనలో పడుతున్నాడు.

"ముష్టివాడికి ఓ పైసా వేసేది అట్టే పోయి వాడి డబ్బు కాజెయ్యడమా?"

"ఆఁ! ... ఆ మాటకొస్తే వీడికి నేనెన్నిమార్లు పావలాలూ పడేసి పైసలూ యివ్వలేదూ?"

"ఇస్తే...?"

"ఇచ్చాం కనక తీసుకోవచ్చు. అంతగా అయితే అప్పుగా తీసుకుంటాం. ఆ తర్వాత వడ్డీతో సహా తీర్చేస్తాం గంటలో."

"ముష్టివాడి దగ్గిర అప్పా? ... దానికి వడ్డీయా?"

"వడ్డీ కాకపోతే వచ్చిందాంట్లో సహం పడేస్తాం. సరా?"

"ఆహా! అలాగా? ... అలా చెప్పి అడిగి చూడు. యిస్తాడేమో?"

"అడగడం ఎందుకు? రూపాయని చెప్పి ఈగుండ్రాయి వాడి డబ్బాలో పడేసి చిల్లరి చెక్కేస్తే సరిపోలే?"

"అన్యాయం!"

"అన్యాయం ఏవిటోయ్! అరవై రూపాయలు వచ్చి పడుతూంటే ... ఆ తరవాత వాడి అర్ధ వాటా వాడికి పడేస్తాంగా? అయినా, నువ్వేమిటీ మధ్యన "నోరు మూసుకుని పడి ఉండక" అంటూ రవణయ్య అంతరాత్మ నోరు నొక్కి, గొల్లుమన్న బీదవాడి డబ్బా గోల వినిపించుకోకుండా, గుప్పిట్లో చిల్లరతో బ్రాకెట్ కట్టే కిళ్ళీ బడ్డీలవేపు ఒక్క దౌడు తీశాడు.

దౌడు తీసినప్పటి చురుకు, తిరిగి రాత్రికి పన్నెండున్నరకి ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుంటూ వచ్చేటప్పుడు లేదు రవణయ్యకి-అసలు చైతన్యమే వుండకపోను. రోడ్డుకి అడ్డ గా విరిగి పడివున్న ముష్టివాడి చేతికర్ర కాళ్ళకి తగలకపోతే, వులిక్కిపడి అటు చూశాడు, గుండ్రంగాపడుతూన్న లైటు వెలుగులో సుళ్ళు తిరుగుతూ మెరుస్తున్న ఒక రక్తపు చారికగడ్డ కడుతూ నల్లబడుతూంటే రవణయ్య గుండెల్లో జివ్వుమన్నట్లయి, కెవ్వుమని అరవబోయి అటు చూశాడు.

రోడ్డుకి కుడిపక్కగా తీసి ఆపుచేసి వుంచిన బరువైన బియ్యపు బస్తాల లారీ.

ఎడంప్రక్కగా గుడ్డివాడు కూర్చునే స్థలంలో భయంకరమైన శూన్యం.

కళవళపడుతూ రవణయ్య కంగారుగా లారీ నీడలోకి

వెళ్ళాడు. యిద్దరు కాకిబట్టల ఆసామీలతో తన సర్వీసులో చూసిన ఏక్సిడెంట్లని గురించి ఉత్సాహంగా చెబుతూన్న కానిస్టేబుల్ కనిపించాడు, "ఏమయింది....యిక్కడ గుడ్డివాడు వుండాలి. ఏడీ!" అలా అడిగాడు రవణయ్య గాభరాగా.

మంచి రసపట్టులో వున్న కథకి అడ్డువచ్చిన రవణయ్య మీద విసుక్కుంటూ "ఏం? వాడు నీకు చుట్టమా?.... డబ్బు పోయే డబ్బు పోయే అని నెత్తీ నోరూ మొత్తుకుంటూ అర్ధరాత్రికి అర్ధరాత్రి అర్జంటుగా మొలకొలుకులు బియ్యాని మద్రాసు చేరెయ్యవలసిన ఈ లారీ కిందకి వచ్చి వాడిని ఎవరు పడమన్నాడు? వాడి చావు కాదు కాని ఈ చలిలో రోడ్డుపక్కని మాచావుకొచ్చింది! ఫో. జనరల్ హాస్పటల్ కి ఫో! అక్కడికి తీసుకుపోయారు వాడిని పోస్టుమార్టమ్ కి" అంటూ అటు తిరిగి ఆ ఆసామీల దగ్గరనించి బీడి ఓటి పుచ్చుకొని వెలిగిస్తూ "ఆ...ఎంత వరకూ చెప్పాను?" అన్నాడు కానిస్టేబుల్.

"ఆ!" అని ఒక్క గావుకేక పెట్టి నీరసంగా పరుగు తీశాడు రవణయ్య హాస్పటల్ కేసి.

హాస్పిటల్ అధికారులకి "శవం ముట్టిందని" రశీదు రాసి యిస్తూంటే రవణయ్యకి గుండెల్లోంచి పెల్లుబికి వచ్చింది దుఃఖం.

అప్పుడు బావురుమని ఏడ్చిన రవణయ్య, "చందా వేసి ఆముష్టివాడికి దహనంఏర్పాట్లు చేయిస్తున్నావు. నీకేవిటి సంబంధం!" అన్న ఆచారి మాటలకి, "వాడు క్లోజింగా

నేను ఓపెనింగూ రా. మేం యిద్దరం డబుల్ జీరో!" అంటూ భయంకరంగా ఓ వెఱ్ఱి నవ్వు నవ్వాడు. గుడ్డివాడి శవం కాలుతోంటే మళ్ళీ అలాంటి నవ్వే నవ్వి, తన జేబులో అప్పటిదాకా అతి పదిలంగా దాచుకొన్న బ్రాకెట్ కాగితపు రీలు తీసి ఆ మంటల్లో విసిరి, సున్నాలు సున్నాలుగా పైకి పోతూన్న పొగని చూసి, "డబుల్ జీరో" అని ఓ వికటాట్టహాసం చేశాడు రమణయ్య. ఇవాల్టికి కూడా ఏ అర్ధరాత్రి వేళో వున్నట్టుండి శ్మశానాల్లోంచి గుండె అవిసేలా "డబుల్ జీరో" అన్న కేక ఓటివినిపిస్తూనే వుంటుంది ఆవూళ్ళో వాళ్ళకి!